'ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలి'

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లోని దేవాదాయ శాఖ ఆధీనంలో గల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ పాలక మండలి ఏర్పాటు విషయంలో నిబంధనలు పాటించని ఈవో సురేందర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు కోరారు. ఈమేరకు దేవాదాయ శాఖ అదనపు ఉప కమిషనర్ కృష్ణవేణికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారం ఆలయ కమిటీ ఏర్పాటు విషయంలో స్థానిక కార్పొరేటర్‌కు సమాచారం అందించాల్సి ఉండగా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆలయ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధి విషయంలో దృష్టి పెట్టని ఈవో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందించినవారిలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, సీనియర్ నాయకులు బుర్ర రాజేశ్వర్, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

చండీ హోమంలో ఎంపీ ఈటల



బోడుప్పల్: వక్ఫ్‌బోర్డు సమస్య పరిష్కారం కావాలని కోరుతూ శ్రీసాయినగర్ కాలనీలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు తుప్పుత్ ఆనంద్ నిర్వహించిన చండీ హోమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతోపాటు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వక్ఫ్‌బోర్డు సమస్యను పలు కాలనీవాసులతో చర్చించారు. సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం కాలనీవాసులతో కలిసి సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు



అవగాహన కల్పిస్తున్న మేడ్చల్-మల్కాజిగిరి సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి డీ కిరణ్‌కుమార్

అల్వాల్: న్యూఢిల్లీ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా జడ్జి వి.బాల భాస్కర్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్-మల్కాజిగిరి సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి డీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అల్వాల్ యాదమ్మనగర్ బస్తీలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. చట్టాల అమలులో ప్రజలు భాగస్వామ్యులు కావాలని, అప్పుడే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీ సురేశ్‌కుమార్, డీ రాకేశ్, పారా లీగల్ వలంటీర్స్, బస్తీవాసులు నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మహాత్మా గాంధీనగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సృజయ్, కాలనీవాసులు నరహరి, చిన్నయ్య, నరేశ్, సత్యనారాయణ, నరేందర్‌సింగ్, వెంకట్, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సందీప్‌రెడ్డి, దేవేందర్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏఈకి శుభాకాంక్షలు



మల్లాపూర్: మల్లాపూర్ విద్యుత్ ఏఈగా బాధ్యతలు చేపట్టిన నాగరాజును మల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు జీరో కరెంట్ బిల్లు సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని ఏఈని కోరారు. ఆయన వెంట అన్నపూర్ణ కాలనీ అధ్యక్షుడు పాండాల నరసింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

మౌలాలి : మల్కాజిగిరి దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఎన్నికలను గురువారం నిర్వహించారు. పాత సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షణీయమని ప్రధాన కార్యదర్శి చేకొండ నరేశ్‌బాబు తెలిపారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా వంశీ, ప్రధాన కార్యదర్శిగా చేకొండా నరేశ్‌బాబు, సహాయకార్యదర్శిగా నజీర్, కోశాధికారి ఈశ్వర్ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ లేఖరులకు దస్తావేజులలో ఎలాంటి అసౌకర్యం ఉన్న వాటిని నివృత్తి చేయడమే కాకుండా వారికి లబ్ధి చేకూరేలా చూస్తామని పేర్కొన్నారు.

ఆదర్శ్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



అల్వాల్: అల్వాల్ డివిజన్ ఆదర్శ్‌నగర్ సెయింట్ జేవియర్స్ స్కూల్ వీధిలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. కాలనీకి మంజూరైన బాక్స్ డ్రైన్ స్థలాన్ని పరిశీలించారు. వెంటనే పనులు ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏఈ అభిషేక్, రామారావు, మల్లేశ్‌గౌడ్, గిరి, ప్రేమ్, యాదగిరి, అమూల్, భాగ్య, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యనందించాలి



పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, మేయర్ అజయ్‌యాదవ్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- రూ 3.50 కోట్లతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభం
- హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. టెక్నిప్ ఎఫ్ఎంసీ మల్టీనేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో రూ 3.50 కోట్ల వ్యయంతో చెంగిచర్లలో రెండు ఎకరాల్లో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, పేదలకు చేసిన సేవలే శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. అనంతరం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం వసతులు కల్పిస్తున్నదన్నారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌తోపాటు అమెరికాలో స్థిరపడినారని గుర్తు చేశారు. కులాలు, అంతరాలు లేని సమాజం కోసం అంబేడ్కర్ కలలు కన్నారని, అది నేటికీ నెరవేరలేదన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు వారికి సక్సెస్ స్టోరీలు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, టెక్నిప్ ఎఫ్ఎంసీ ప్రెసిడెంట్ ఆండర్స్ డాల్, వైస్ ప్రెసిడెంట్ హోసిల్లా తివారీ, మేనేజింగ్ డైరెక్టర్ అర్జున్ రుమల్లా, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బింగి జంగయ్యయాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

బోడుప్పల్: చెంగిచర్ల ద్వారకానగర్ ఫేస్-2 కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆ కాలనీవాసులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సంతోష్ పాటిల్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సెల్‌టవర్‌ను ఏర్పాటు చేయవద్దని ఇప్పటికే అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, బోడుప్పల్ కమిషనర్ రామలింగం, మేయర్ అజయ్‌యాదవ్‌కు వినతి పత్రం అందజేసినా అనుమతులు మంజూరు చేశారన్నారు. సెల్‌టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వారికి మద్దతుగా ఒకటో డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యుడు కుర్రి శివశంకర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన

ఉప్పల్: ఉప్పల్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫ్రాజ్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి గురువారం పర్యటించారు. ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ విభాగం చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పార్ట్ పనుల జాప్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ నిర్వాసితులతో మాట్లాడి భూసేకరణ మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వారి వెంట ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీరు దేవానంద్, ఉప్పల్ డీసీ ఆంజనేయులు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురు చిన్నారులపై కుక్క దాడి



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌కాలనీలో చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. గురువారం సాయంత్రం అబ్దుల్ రహ్మాన్ (6) విజయ్ (7) మరో నలుగురి చిన్నారులపై కుక్క స్వైర విహారం చేస్తూ కాళ్లు, చేతులపై దాడి చేసి కరిచింది. దీంతో తల్లిదండ్రులు చిన్నారులను ఆస్పత్రులకు తీసుకెళ్లి టీకాలు వేయించారు.

విజిలెన్స్‌పై అవగాహన

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో హెచ్‌పీసీఎల్ పైప్ లైన్ వారి ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని, ముందస్తు సమాచారం ఇస్తూ చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారితోనే లంచగొండితనం నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సిబ్బంది నాగఅయ్యప్ప, హెచ్ఎం వరలక్ష్మీ, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మాదారం, ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్షానికి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కేంద్రాలు ఏర్పాటు చేసి 20 రోజులైన తూకం ప్రారంభించలేదన్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, లేని పక్షంలో ప్రభుత్వ అలసత్వంపై రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఏసీఎస్ డైరెక్టర్ పోచిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కుమార స్వామి, లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజూ గ్రూప్-1 మెయిన్స్ ప్రశాంతం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని రెండు సెంటర్లలో నాలుగో రోజూ గ్రూప్-1 మెయిన్స్ ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 1394 మంది అభ్యర్థులకు 919 మంది హాజరు కాగా, సెంటర్-1లో 130 మంది, సెంటర్-2లో 345 మంది గైర్హాజరయ్యారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ జ్యోతినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, రాజుగౌడ్, గోపి, మురళి తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి శ్రీమన్నారాయణ మృతి తీరనిలోటు

గౌతంనగర్: అమృత్ పురస్కార గ్రహీత, కూచిపూడి నాట్యాచార్యులు మహంకాళి శ్రీమన్నారాయణ మృతి కూచిపూడి కళా రంగానికి తీరని లోటని కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు నాట్య గురువు డాక్టర్ ఎస్పీ.భారతి అన్నారు. శ్రీమన్నారాయణ మృతిపై బుధవారం రాత్రి ఆమె సంతాపం వ్యక్తం చేశారు.

జీఐఎస్ సర్వేను నిలిపివేయాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో చేపట్టిన జీహెచ్ఎంసీ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) సర్వేను తాత్కాలికంగా నిలిపివేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ డిమాండ్ చేశారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ వద్ద ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను వివరాలు ఉన్నాయని సర్వే పేరిట మళ్లీ ఆస్తి పన్ను రసీదు, విద్యుత్ బిల్లులు అడగడం వలన ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. సర్వే దేని కోసం అనేది స్పష్టత ఇవ్వడమే కాకుండా స్థానికంగా సమావేశం ఏర్పాటు చేసి అందరికీ ఆమోదయోగ్యమైతేనే సర్వే చేపట్టాలని ఆయన అధికారులను కోరారు.

నాటడమెందుకు.. నరకడమెందుకు?



రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న దృశ్యాలు



మేడ్చల్: ప్రభుత్వాలు లక్ష్యాలను చేరుకోవడానికి ఆదరాబాదరగా మొక్కలు నాటడం తీరా అవి పెరిగాక రోడ్లకు అడ్డంగా ఉన్నాయని, కరెంట్ తీగల కింద ఉన్నాయని తొలగించడం పరిపాటిగా మారిపోయింది. ఇలాంటి ఘటనే గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సాగుతోంది. గుండ్లపోచంపల్లి శివారు నుంచి అయోధ్య చౌరస్తా వరకు గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు రెండు రోజులుగా చెట్లను తొలగించి యంత్రాలతో శుభ్రం చేస్తున్నారు. రోడ్డుపైకి వచ్చిన కొమ్మలను తొలగించి వాహనదారులకు ఇబ్బందులను తొలగించడం మంచిపనైనా లక్షలు వెచ్చించి ఏళ్ల తరబడి పోషించిన చెట్లను తొలగించడంతో అధికారుల అనాలోచిత చర్యలు బయటపడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గుండ్లపోచంపల్లి-నూతన్‌కల్ రోడ్డులో అధికారులు మొక్కలు నాటారు. తమ టార్గెట్‌లను పూర్తి చేసుకోవడానికి రోడ్డుకు ఇరువైపులా అప్పటికే చెట్లు ఉన్నప్పటికీ రోడ్డుకు దగ్గరగా అప్పటి అధికారులు మొక్కలు నాటారు. దీనికి లక్షల రూపాయలు వెచ్చించారు. ప్రస్తుతం అప్పట్లో నాటిన మొక్కలు చెట్లుగా మారి రోడ్లపైకి రావడంతో వాటిని తొలగిస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో ముందు ఆలోచనలు చేసి రోడ్డుకు దూరంగా నాటి ఉంటే వాటిని నేడు తొలగించాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ధనంతో మొక్కలు నాటే సమయంలో ముందుచూపుతో నాటాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్య విద్యార్థులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

మల్లాపూర్: ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఉప్పల్ నియోజకవర్గ నిరుపేద విద్యార్థులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థికంగా చేయూతనందించారు. మల్లాపూర్ అశోక్‌నగర్‌కు చెందిన కావ్య పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. అదేవిధంగా న్యూ భవానీనగర్‌కి చెందిన అఖిల, ఆలేటి విశ్వ రేతన్ రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ యాద్రాది, వరంగల్ కళాశాలలో ఎంబీఎస్ఎస్ సీటు సాధించారు. అయితే వారు ఫీజు కట్టలేక ఇబ్బందిపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వయంగా వారి ఇంటికి వెళ్లి ఎంబీబీఎస్‌కి ఫీజు ఇద్దరికీ రూ.60 వేలు, అలాగే ఒక్కరికి రూ.29 వేల చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, నేతలు కటార్ల భాస్కర్, లక్ష్మీనారాయణ, నరేశ్, శ్రీశైలం యాదవ్, దయాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, ఉస్మాన్, రఘు, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, పేపర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో స్వచ్ఛత కార్యక్రమం



స్వచ్ఛత కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ఆల్ సోల్స్ డేను పురస్కరించుకుని మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, లక్ష్మీనగర్‌లోని హిందూ, క్రైస్తవ శ్మశానవాటికల్లో గురువారం కార్పొరేటర్ ప్రభుదాస్ స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో శ్మశానవాటికలో చెత్తాచెదారం ఎత్తి పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించారు. చనిపోయిన వారిని కుటుంబ సభ్యులను స్మరించుకుంటూ సమాధుల వద్ద శుభ్రం చేసి దీపాలు వెలిగించడం ఆల్ సోల్స్ డే ప్రత్యేకతని కార్పొరేటర్ ప్రభుదాస్ తెలిపారు.

పైపులైన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: వీరారెడ్డినగర్ కాలనీలో కొనసాగుతున్న పైప్‌లైన్ పనులను నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతకు ముందు చిన్నపాటి వర్షానికే వరద నిలిచి ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యను జోనల్ కమిషనర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, కాలనీవాసి దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పనుల పరిశీలన...



పనులను పరిశీలిస్తున్న డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి

గౌతంనగర్: రామాంజనేయనగర్ అన్నపూర్ణ సొసైటీలో వరద ముంపు నివారణకు నిర్మిస్తున్న ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులను మల్కాజిగిరి సర్కిల్ డీఈ లౌక్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నపూర్ణ సొసైటీ, రామాంజనేయనగర్, మహేంద్రహిల్స్ నుంచి వస్తున్న వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకే ఈ పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ దివ్యజ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



కొనసాగుతున్న రాంపల్లి-చర్లపల్లి రహదారి విస్తరణ పనులు



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో గల వివిధ ప్రధాన రహదారుల విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో ఏళ్ల తరబడి రహదారుల బాగుకోసం వేచిచూసిన ప్రజల కళ త్వరలోనే నెరవేరనున్నది. చర్లపల్లిలో రైల్వేశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన కొత్త రైల్వేస్టేషన్ పనులు దాదాపు పూర్తికావడంతో త్వరలో ఈ రైల్వేస్టేషన్ ప్రారంభం కానున్నది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రయాణికులు చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హెచ్ఆర్‌డీసీఎల్ ద్వారా చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు సులువుగా ప్రయాణికులు చేరుకునే విధంగా నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో గల 6 రహదారులను రూ. 254 కోట్ల నిధులను వెచ్చించి రాంపల్లి చౌరస్తా నుంచి-యంనంపేట, రాంపల్లి- చర్లపల్లి బీఎస్ఎన్ఎల్ వరకు, రాంపల్లి-కరీంగూడ ఓఆర్ఆర్, రాంపల్లి-సాయిగూడెం ఓఆర్ఆర్, దమ్మాయిగూడ రోస్‌గార్డెన్ నుంచి నాగారం వరకు, నాగారం డబుల్‌బెడ్‌రూమ్ నుంచి యంనంపేట వరకు రోడ్డు విస్తరణ పనులను చేపడుతోంది. ఈ రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం రాంపల్లి-చర్లపల్లి వరకు రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో పక్క రాంపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి యంనంపేట రహదారి, సాయిగూడెం నుంచి రాంపల్లి వరకు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపు, పొక్లెయిన్‌తో రోడ్డు చదును చేసే పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రహదారులను 100 అడుగుల రహదారులుగా విస్తరించడంతోపాటు, నాలుగులేన్ల రహదారులుగా విస్తరించి రోడ్డు మధ్యలో డివైడర్, చెట్లు, వీధి దీపాల ఏర్పాటు, రెండువైపులా వాకింగ్ ట్రాక్ తదితర పనులను చేపట్టనున్నట్లు హెచ్ఆర్‌డీసీఎల్ సంస్థ డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. త్వరలో చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ రహదారులను విస్తరించి రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు త్వరగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకోవడానికి ఈ రహదారులను విస్తరించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తమ ప్రాంత రహదారులు బాగుపడుతుండటంతో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల ప్రజలతోపాటు, రాంపల్లి, కరీంగూడ, యంనంపేట, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.